# ప్రభుత్వ ఆస్పత్రుల్లో మెరుగైన వైద్యం

● అందోల్ ఎమ్మెల్యే క్రాంతి కిరణ్


శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే క్రాంతికిరణ్

**అల్లాదుర్గం(మెదక్):** పేద ప్రజలకు ప్రభుత్వ ఆస్పత్రుల్లో మెరుగైన వైద్యం అందిస్తున్నట్లు అందోల్ ఎమ్మెల్యే క్రాంతి కిరణ్ అన్నారు. శుక్రవారం అల్లాదుర్గం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రూ.16 లక్షలతో నిర్మిస్తున్న అదనపు గదుల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాల్లో ఉచితంగా అన్ని రకాల వైద్య పరీక్షలు చేస్తారని, వీటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ అనిల్ కుమార్‌రెడ్డి, దక్షిణ మధ్య రైల్వే బోర్డు సభ్యుడు కాశీనాథ్, సర్పంచ్ అంజయ్య యాదవ్, డాక్టర్ అశ్విని, పీఏసీఎస్ చైర్మన్ దుర్గారెడ్డి, నాయకులు ప్రకాశం, నర్సింలు, రవి, శివరాం, సుభాష్, సాయిబాబా తదితరులు పాల్గొన్నారు.

### 108 అంబులెన్సు ప్రారంభం

**అల్లాదుర్గం(మెదక్):** మండల కేంద్రంలోని ఆరోగ్య కేంద్రానికి మంజూరైన 108 అంబులెన్స్‌ను శుక్రవారం అందోల్ ఎమ్మెల్యే క్రాంతి కిరణ్ ప్రారంభించారు. అంబులెన్సు మంజూరై 40 రోజులు అవుతోంది. కాగా ఇన్ని రోజులు క్షతగాత్రులు, అత్యవసరం ఉన్నవారిని అంబులెన్స్‌లో తరలించిన సిబ్బంది.. శుక్రవారం ఎమ్మెల్యే చేతుల మీదుగా ప్రారంభోత్సవం ఉందని అత్యవసర కేసులను తీసుకోలేదు. మండలంలోని అప్పాజీపల్లికి చెందిన చాకలి ఇస్తారి అనారోగ్యానికి గురవగా కుటుంబ సభ్యులు 108 అంబులెన్సుకు ఫోన్ చేశారు. అంబులెన్సు అందుబాటులో లేదని, ఎమ్మెల్యే ప్రారంభోత్సవం ఉందని చెప్పడంతో ఆటోలో పెద్దశంకరంపేట ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అవసరంలో ఉపయోగపడాల్సిన అంబులెన్స్‌ను ప్రారంభోత్సవం పేరిట సిబ్బంది నిరాకరించడంపై పలువురు విమర్శిస్తున్నారు. మరోవైపు ప్రారంభోత్సవ ఏర్పాట్లు సరిగా చేయలేదని సిబ్బందిపై ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది.

## పోషణ ప్రతిజ్ఞ


పోషణ మాసోత్సవాల్లో భాగంగా మండల కేంద్రమైన శివ్వంపేటలో శుక్రవారం పీహెచ్‌సీ, కస్తూర్బా గిరిజన బాలికల వసతిగృహంలో విద్యార్థులు పోషణ ప్రతిజ్ఞ చేశారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు అందిస్తున్న పౌష్టికాహారం సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ సాయిసౌమ్య, ఐసీడీఎస్ సూపర్ వైజర్ సంతోష తెలిపారు.
– శివ్వంపేట(నర్సాపూర్)

## క్లుప్తంగా

### అభివృద్ధిని చూసి చేరికలు


కండువా కప్పుతున్న ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి

**నిజాంపేట(మెదక్):** ప్రభుత్వ అభివృద్ధి పథకాలకు ఆకర్షితులై బీఆర్‌ఎస్‌లో చేరుతున్నారని ఎమ్మెల్యే పద్మాదేవేందర్ రెడ్డి అన్నారు. మండలంలోని నస్కల్‌కు చెందిన పలువురు మైనార్టీ నాయకులు శుక్రవారం ఆమె గృహంలో బీఆర్‌ఎస్‌లో చేరగా, వారికి కండువా కప్పి ఆహ్వానించారు. అనంతరం ఖబరస్థాన్ ప్రహరీ నిర్మాణానికి రూ.5 లక్షల ప్రోసిడింగ్‌ను అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ సిద్ధిరాములు, సుధాకర్ రెడ్డి, ఎంపీటీసీ బాల్ రెడ్డి, కోఆప్షన్ సభ్యులు గౌస్, ఎల్లం యాదవ్, పిట్ల మహేష్, ఎండీ అబ్దుల్, రాజు, వార్డు సభ్యులు హబీబ్, అక్బర్, ఎండీ మహమూద్, ఇస్రాపిల్ జాకీర్ తదితరులు పాల్గొన్నారు.

### సీఎంకు సమస్యలు వివరిస్తా


సునీతారెడ్డికి వినతిపత్రం ఇస్తున్న అంగన్‌వాడీలు

**నర్సాపూర్:** అంగన్‌వాడీ టీచర్లు, ఆయాల సమస్యలను సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ సునీతారెడ్డి అన్నారు. ఐదు రోజులుగా సమ్మె చేస్తున్న అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు శుక్రవారం పిల్లల పార్కు సమీపంలో సునీతారెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో యూనియన్ ప్రతినిధులు అన్నపూర్ణ, ఇందిర, ఫరీదా ఉన్నారు.

### ఆర్థికసాయం

**నిజాంపేట(మెదక్):** మండల కేంద్రంలోని వంజరి సంఘంలో మెరిట్ విద్యార్థులకు వంజరి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎదుగని వెంకటేశం ఆర్థిక సాయం అందజేశారు. సంఘం నుంచి అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నామని, ఈ క్రమంలో పేద మెరిట్ విద్యార్థులకు రూ.10వేల చెక్కులను అందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు బొడికే పోచయ్య, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నవత్ రాజేందర్, కాలేరు యోగి, జిల్లా కోశాధికారి మధు, అధ్యక్షుడు మావురం ప్రభాకర్, గౌరీ శంకర్, రాష్ట్ర యువజన నాయకులు నవత్ కిరణ్, నాయకులు రామచంద్రం, లక్ష్మణ్, ఆముద రాజు, ఎదగని అంజయ్య, ప్రభాకర్, ధనంజయ పాల్గొన్నారు.

### ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం


ఉపాధ్యాయులను సన్మానిస్తున్న ప్రజాప్రతినిధులు

**వెల్దుర్తి(తూప్రాన్):** రాష్ట్రస్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన పలువురిని ఎంపీపీ స్వరూపనరేందర్‌రెడ్డి, జెడ్పీటీసీ రమేష్‌గౌడ్ శుక్రవారం వెల్దుర్తి ఉన్నత పాఠశాలలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమాజ అభివృద్ధిలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని వివరించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం సాంబయ్య, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

### నేడు సన్నాహక సమావేశం

**కొల్చారం(నర్సాపూర్):** ఈనెల 17న నిర్వహించనున్న విజయభేరి సభ నేపథ్యంలో శనివారం మండలంలోని రంగంపేట సొసైటీ ఆవరణలో పార్టీ నాయకులు, కార్యకర్తల సన్నాహక సమావేశం నిర్వహిస్తున్నట్లు కౌడిపల్లి బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి శుక్రవారం ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు నిర్వహించే ఈ సమావేశానికి పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున హాజరు కావాలని కోరారు.

### వివరాలు పక్కాగా ఉండాలి

**పాపన్నపేట(మెదక్):** కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆయుష్మాన్ భవ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని డీపీహెచ్‌ఎన్ లిల్లీగ్రేస్ కోరారు. శుక్రవారం ఆశ కార్యకర్తలతో నిర్వహించిన సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. ప్రతీ కార్యకర్త ఇంటింటికి వెళ్లి వ్యాధులు, బీపీ, షుగర్ తదితర సమస్యలు ఉన్నవారిని గుర్తించాలని సూచించారు. 16 రోజులపాటు కార్యక్రమం కొనసాగుతుందని, వివరాలు పక్కాగా సేకరించాలన్నారు. సీహెచ్‌ఓ చందర్, పీహెచ్‌ఎన్ రాజశ్రీ, రమణ, శోభారాణి, పాల్గొన్నారు.


మాట్లాడుతున్న లిల్లీగ్రేస్

# ఉపాధ్యాయులు సమాజ మార్గనిర్దేశకులు

● నారాయణఖేడ్ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

**పెద్దశంకరంపేట(మెదక్):** ఉపాధ్యాయులు సమాజ మార్గ నిర్దేశకులని, వారి సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని నారాయణఖేడ్ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి అన్నారు. శుక్రవారం పెద్దశంకరంపేటలో ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ఉత్తమ ఉపాధ్యాయులను పూలమాలలు, శాలువా, జ్ఞాపికలతో సన్మానించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఉపాధ్యాయులు బాధ్యతతో పనిచేయాలని, విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలని అన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ జంగం శ్రీనివాస్, జెడ్పీటీసీ విజయరామరాజు, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు మురళి, సర్పంచ్ సత్యనారాయణ, వైస్ ఎంపీపీ లక్ష్మీ, ఇన్‌చార్జ్ ఎంఈఓ బుచ్చానాయక్, ఎంపీటీసీలు వీణ, దత్తు, స్వప్న, రైతుబంధు అధ్యక్షుడు సురేష్‌గౌడ్, నోడల్ అధికారి విజయ్‌కుమార్, ఉపాధ్యాయ సంఘాల నాయకులు రామచంద్రాచారి, శ్రీనివాస్, మారుతి, గోపి, ఆనంద్, కుమార్, ప్రసన్నకుమార్, సర్పంచ్‌లు తదితరులున్నారు.

### అభివృద్ధిలో ఇంజనీర్స్ పాత్ర కీలకం

**నర్సాపూర్:** అభివృద్ధి పనులలో సివిల్ ఇంజినీర్స్ పాత్ర కీలకమని హెడ్ ఆఫ్ సెంటర్ ఫర్ ఇన్ఫర్మేషన్, కమ్యూనికేషన్ టెక్నాలజీ, నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్ అండ్ పంచాయతీరాజ్.. డాక్టర్ రవిబాబు చెప్పారు. శుక్రవారం ఇంజినీర్ విశ్వేశ్వరయ్య జయంతి సందర్భంగా ఇంజినీర్స్‌డే ను పురస్కరించుకుని బీవీ రాజు ఇంజినీరింగ్ కాలేజీలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. కాలేజీలోని సివిల్ ఇంజినీరింగ్ విభాగంలోని ల్యాబొరేటరీని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థులు కాంక్రీటుతో తయారు చేసిన పడవలో పర్యటించి ఆనందం వ్యక్తం చేశారు. కాలేజ్ డైరెక్టర్ లక్ష్మీప్రసాద్, ప్రిన్సిపాల్ సంజయ్‌దూబె, హెచ్‌ఓడీ కృష్ణరావు, మేనేజర్ బాపిరాజు పాల్గొన్నారు.

### చెడు అలవాట్లకు దూరంగా ఉండాలి

**నర్సాపూర్:** విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని సీఐ షేక్‌లాల్ మదార్ హితవు పలికారు. శుక్రవారం పట్టణంలోని ఓ ప్రైవేటు కాలేజీలో షీ టీం, పోలీసు శాఖకు చెందిన కళాబృందంతో పలు అంశాలపై అవగాహన కల్పించారు. 100 డయల్ ఉపయోగం, సైబర్ నేరాలు, రోడ్డు ప్రమాదాల నివారణ, బాల్యవివాహాల నిర్మూలన తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని, సత్ప్రవర్తన కల్గి ఉత్తమంగా జీవించాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో ఎస్‌ఐ శివకుమార్, కాలేజ్ ప్రతినిధి పృథ్వీ పాల్గొన్నారు.

### చలో ఢిల్లీ పోస్టర్ ఆవిష్కరణ

**కొల్చారం(నర్సాపూర్):** చలో ఢిల్లీ కార్యక్రమానికి సంబంధించిన గోడపత్రికను ఎమ్మార్పీఎస్ మండల నాయకులు శుక్రవారం విడుదల చేశారు. ఏబీసీడీ వర్గీకరణ మాదిగల లక్ష్యమన్నారు. రాబోయే పార్లమెంట్ సమావేశాల్లో దానిని చేపట్టాలని కోరుతూ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు.

### ఘనంగా హిందీ దివస్

**మనోహరబాద్(తూప్రాన్):** మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం హిందీ దివస్‌ను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకటస్వామి హిందీ భాష ప్రాముఖ్యతను వివరించారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఉపాధ్యాయురాలు సునిత, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

### ఆలయానికి విరాళం

**నర్సాపూర్‌రూరల్:** మండలంలోని జక్కపల్లి గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న శ్రీ పెద్దమ్మ తల్లి గుడి ఆలయానికి నర్సాపూర్ బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ వాల్దాస్ మల్లేష్‌గౌడ్ రూ.50వేలు విరాళం అందించారు. శుక్రవారం ఆలయ నిర్వాహకులు అందజేశారు. కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం సభ్యులు రమేష్, సుదర్శన్, నాగేష్, శ్రీనివాస్, శివ, పాల్గొన్నారు.

# అధికారుల తీరుపై ఆగ్రహం

వాడీవేడిగా సర్వసభ్య సమావేశం


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ

**వెల్దుర్తి(తూప్రాన్):** మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఎంపీపీ స్వరూపనరేందర్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశం వాడీవేడిగా కొనసాగింది. ఈ సందర్భంగా మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని ప్రజాప్రతినిధులు అధికారులను నిలదీశారు. ఎదుల్లాపల్లిలో మిషన్ భగీరథ నీరు రావడంలేదని, సంబంధిత అధికారుల దృష్టికి పలుమార్లు తీసుకెళ్లినా పట్టించుకోవడంలేదని సర్పంచ్ భూమయ్య వాపోయారు. అదేవిధంగా కొత్త రేషన్‌కార్డులు మంజూరు కాకపోవడంతో పేదలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని సభ దృష్టికి తెచ్చారు. అనంతరం ఎంపీపీ మాట్లాడుతూ గ్రామాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పని చేయాలని సూచించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ రమేష్‌గౌడ్, తహసీల్దార్ తులసీరాం, ఎంపీడీఓ వెంకటలక్ష్మమ్మ, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

### ఉద్యోగ భద్రత కల్పించండి

**మెదక్ మున్సిపాలిటీ:** తమను రెగ్యులరైజ్ చేసి ఉద్యోగ భద్రత కల్పించాలని మున్సిపల్ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు సమ్మెబాట పట్టారు. శుక్రవారం మెదక్ మున్సిపల్ కార్యాలయం వద్ద టెంట్ వేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏళ్ల తరబడి పని చేస్తున్న తమకు సమాన పనికి వేతనం అందించాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాలు వర్తింపజేయాలన్నారు. కార్యక్రమంలో ఆ సంఘం అధ్యక్షుడు సితారి శ్రీనివాస్ ఉపాధ్యక్షుడు నాగరాజు, కార్యదర్శి సంజీవ్, జాయింట్ సెక్రెటరీ కిరణ్ గౌడ్, కోశాధికారి శ్యాంసుందర్, ఎగ్జిక్యూటివ్ మెంబర్ శ్రీనివాస్, సదానంద్, శివ, రాజయ్య, సత్యం, సుధాకర్ పాల్గొన్నారు.


మున్సిపల్ కార్యాలయం వద్ద సమ్మె చేస్తున్న ఉద్యోగులు

### పోలింగ్‌పై అవగాహన

**నర్సాపూర్:** ఓటరు నమోదుపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. పట్టణంలోని ఎల్లంకి డిగ్రీ, జూనియర్ ప్రైవేటు కాలేజీలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ ఆదర్శకుమార్ మాట్లాడారు. 18 సంవత్సరాలు నిండిన యువత ఓటరుగా నమోదు చేసుకోవాలని సూచించారు. అనంతరం విద్యార్థులకు మాక్ పోలింగ్‌పై అవగాహన కల్పించారు. ఆపై యూనియన్ ఎన్నికలు నిర్వహించగా జూనియర్ కాలేజీ యూనియన్ అధ్యక్షుడిగా రామకృష్ణ, డిగ్రీ కాలేజీ విద్యార్థుల యూనియన్ అధ్యక్షుడిగా హర్షవర్ధన్‌గౌడ్ ఎన్నికయ్యారు. కార్యక్రమంలో రాష్ట్ర గజిటెడ్ హెడ్మాష్టర్ల సంఘం గౌరవ అధ్యక్షుడు మోహన్‌రెడ్డి, ఆర్‌ఐ ఫైజల్, డిగ్రీ కాలేజీ కరస్పాండెంట్ అశోక్‌కుమార్, ఇతర ప్రతినిధులు సందీప్‌కుమార్, సోమలింగ్ పాల్గొన్నారు.

**పెద్దశంకరంపేట(మెదక్):** ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు శుక్రవారం మాక్ పోలింగ్‌పై తహసీల్దార్ గ్రేస్‌బాయి, ప్రిన్సిపాల్ అవనీష్‌రెడ్డి అవగాహన కల్పించారు. అర్హులు తప్పకుండా ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. ఎన్నికల నిర్వహణ, పోలింగ్ బూత్‌లో ఏజెంట్ల పనితీరు, పోస్టల్‌బ్యాలెట్ తదితర అంశాలపై వివరించారు. కార్యక్రమంలో లెక్చరర్లు అనంతరాజ్‌శర్మ, రమేష్, ప్రభాకర్, రాజు, శ్రీశైలం, జహీరాబేగం, అభిలాష్ తదితరులున్నారు.



నర్సాపూర్: మాక్ పోలింగ్‌లో విద్యార్థులు

# స్వచ్ఛతకు ప్రజలు సహకరించాలి


స్వచ్ఛత కార్యక్రమం నిర్వహిస్తున్న మున్సిపల్ చైర్మన్ జితేందర్

**రామాయంపేట(మెదక్):** మున్సిపాలిటీ పరిధిలో గ్రామాలు, వార్డుల పరిశుభ్రతకు ప్రజలు సహకరించాలని మున్సిపల్ చైర్మన్ జితేందర్‌గౌడ్ అన్నారు. శుక్రవారం వార్డులు, పార్కు, బస్టాండు, తదితర ప్రదేశాల్లో స్వచ్ఛతపై దృష్టి సారించాలన్నారు. గుల్పర్తిలో మురికి కాలువలు శుభ్రం చేయించి, దోమల మందు పిచికారీ చేయించారు. చెత్తా చెదారాన్ని ఆరుబయట వేయొద్దని సూచించారు. మున్సిపల్ కమిషనర్ ఉమాదేవి, మేనేజర్ శ్రీనివాస్, మున్సిపల్ కౌన్సిలర్ కవిత, వార్డు అధికారులు, మహిళా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

# మండపాల వద్ద కాపలా ఉండాలి

తూప్రాన్ డీఎస్పీ యాదగిరిరెడ్డి


మాట్లాడుతున్న తూప్రాన్ డీఎస్పీ యాదగిరిరెడ్డి, పక్కన ఆర్‌డీఓ, అధికారులు

**నర్సాపూర్ :** వినాయక నవరాత్రులను పురస్కరించుకుని ఏర్పాటు చేసే మండపాలు, పూజా విధానాలు, మన సంస్కృతి ఉట్టి పడేలా ఉండాలని తూప్రాన్ డీఎస్పీ యాదగిరిరెడ్డి హితవుపలికారు. శుక్రవారం స్థానిక పోలీసులు ఏర్పాటు చేసిన శాంతి కమిటీ సమావేశంలో మాట్లాడారు. ఎలాంటి అపశ్రుతులు తలెత్తకుండా నిర్వాహకులు అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. మండపాల వివరాలు సమాచారం కోసం తెలియజేయాలన్నారు. ఆర్‌డీఓ శ్రీనివాసులు మాట్లాడుతూ భక్తి, శాంతియుతంగా నవరాత్రులు చేపట్టాలన్నారు. ఎలాంటి ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. సీఐ షేక్‌లాల్ మదార్ మాట్లాడుతూ డీజే సౌండ్‌కు అనుమతులు లేవని, నిబంధనలు ఎవరూ ఉల్లంఘించవద్దని సూచించారు. మున్సిపల్ కమిషనర్ వెంకట్‌గోపాల్ మాట్లాడుతూ ఆయా మండపాలలో ఏర్పాటు చేసే ప్రతిమల ఎత్తు వివరాలు తెలిపితే నిమజ్జనానికి అవసరమైన ఏర్పాట్లు చేసే వీలుంటుందని చెప్పారు. ఏడీఈ జయరాంరెడ్డి, తహసీల్దార్ కమలాద్రీ, ఎస్‌ఐ శివకుమార్, ఎంపీడీఓ మార్టిన్‌లూథర్, ఫైర్ ఆఫీసర్ అమర్నాథ్‌గౌడ్, పూజారి వీరప్పగురూజీ పాల్గొన్నారు.

**ప్రశాంతంగా జరుపుకోవాలి**

**చిలప్‌చెడ్(నర్సాపూర్):** వినాయక నవరాత్రి ఉత్సవాలు ప్రశాంతంగా జరుపుకోవాలని ఎస్‌ఐ షేక్ మహబూబ్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రమైన చిలప్‌చెడ్ పోలీస్‌స్టేషన్ ఆవరణలో పీస్ కమిటీతో సమావేశం నిర్వహించారు. ఎంపీపీ వినోద, తహసీల్దార్ ముసాద్దిక్ హాజరయ్యారు.

**చేగుంట(తూప్రాన్):** పండుగలు శాంతియుతంగా జరుపుకోవాలని చేగుంట ఎస్‌ఐ హరీశ్ అన్నారు. చేగుంట పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం పీస్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ వినాయక మండపాల ఏర్పాటుకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని నిర్వాహకులకు సూచించారు. ఎంపీపీ శ్రీనివాస్, చేగుంట మాసాయి పేట మండలాల తహశీల్దార్లు గియాస్ ఉన్నీసాబేగం, జ్ఞాన జ్యోతి బీజేపీ, బీఆర్‌ఎస్, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

**మండల పరిషత్ కార్యాలయంలో...**

**తూప్రాన్:** వినాయక నవరాత్రి ఉత్సవాల సందర్భంగా మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీఓ రమేశ్ అధ్యక్షతన ఆయా శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా వినాయక చవితి సందర్భంగా తీసుకోవాల్సిన అంశాలపై చర్చించారు. సమావేశంలో తహసీల్దార్ విజయలక్ష్మి, ఎస్‌ఐ యాదగిరి, విద్యుత్‌శాఖ ఏఈ వరహాలరావు పాల్గొన్నారు.

**రేగోడ్(మెదక్):** గణేశ్ పండుగ, మిలాదున్ నబీని ప్రజలు శాంతియుతంగా జరుపుకోవాలని అల్లాదుర్గం సీఐ జార్జి కోరారు. రేగోడ్ పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం గణేశ్ మండపాల నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. తహసీల్దార్ కృష్ణ, ఎస్‌ఐ రాజయ్య, సర్పంచ్ నర్సింహులు, ఎంపీటీసీ నర్సింహులు, పీఏసీఎస్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎండి.సర్దార్ పాల్గొన్నారు.

**మనోహరాబాద్(తూప్రాన్):** మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో ఎస్‌ఐ కరుణాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో వినాయక చవితి, మిలాద్–నబీ సందర్భంగా శాంతి కమిటీ సమావేశం నిర్వహించారు. తహసీల్దార్ శ్రీకాంత్, సీనియర్ అసిస్టెంట్ కృష్ణమూర్తి, కల్లకల్ సర్పంచ్ నత్తి మల్లేష్, పీఏసీఎస్ డైరెక్టర్‌జావేద్ పాష, ప్రజాప్రతినిదులు పాల్గొన్నారు.

**చిన్నశంకరంపేట(మెదక్):** ప్రశాంత వాతావరణంలో చవితి వేడుకలు జరుపుకోవాలని ఎస్‌ఐ నారాయణగౌడ్ సూచించారు. శుక్రవారం ఐకేపీ భవనంలో పీస్ కమిటీ సమావేశంలో పాల్గొన్నారు. ఇబ్బందులు కలుగకుండ చూసుకోవాలని, మండపాల నిర్వహణకు అనుమతి తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డి, ఆర్‌ఐ చంద్రశేఖర్ పాల్గొన్నారు.



## సంక్షిప్త వార్తలు

◆ **నేడు మండల సర్వసభ్య సమావేశం**

**శివ్వంపేట(నర్సాపూర్):** మండల సర్వసభ్య సమావేశం శనివారం జరుగుతోందని ఎంపీపీ కల్లూరి హరికృష్ణ శుక్రవారం తెలిపారు. ఎంపీడీఓ కార్యాలయంలో ఉదయం 11 గంటలకు జరిగే సమావేశానికి అందరూ హాజరుకావాలన్నారు.

◆ **క్రీడల్లో రాణించాలి**

**శివ్వంపేట(నర్సాపూర్):** విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని ఎంపీపీ కల్లూరి హరికృష్ణ అన్నారు. మండల పరిధి గోమారం ఉన్నత పాఠశాలలో శుక్రవారం ఎస్‌జీఎఫ్ మండలస్థాయి ఖోఖో, వాలీబాల్, కబడ్డీ క్రీడలను ప్రారంభించారు. మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షురాలు లావణ్య మాధవరెడ్డి, ఎంపీటీసీ నర్సింహారెడ్డి, ఉప సర్పంచ్ శ్రీనివాస్, పీడీలు పాల్గొన్నారు.

◆ **ఐలమ్మను ఆదర్శంగా తీసుకోవాలి**

**శివ్వంపేట(నర్సాపూర్):** వీరనారి చాకలి ఐలమ్మను స్ఫూర్తిగా తీసుకుని ముందుకు వెళ్లాల్సిన అవసరం ఉందని జెడ్పీటీసీ పబ్బ మహేశ్ గుప్తా అన్నారు. మండల పరిధిలోని పెద్దగొట్టిముక్ల గ్రామంలో ఐలమ్మ విగ్రహ ఏర్పాటుకు రూ.30 వేలు, సీతారం తండాకు చెందిన పేద విద్యార్థిని మధుప్రియ చదువు కోసం రూ. 5 వేల నగదును అందించారు.

◆ **అన్నదానం**

**రేగోడ్(మెదక్):** మండల కేంద్రంలోని దుర్గమ్మ ఆలయం, ప్యారారంలో శుక్రవారం ఆంజనేయస్వామికి అభిషేకం నిర్వహించి అన్నదానం చేపట్టారు. అనంతరం భజన కళాకారులు, యువచైతన్య యూత్ బాధ్యులను సన్మానించారు.

◆ **బీఆర్‌ఎస్ పాలనకు చరమగీతం పాడాలి**

**హవేళిఘణాపూర్(మెదక్):** అవినీతిలో కూరుకుపోయిన బీఆర్‌ఎస్ పాలనకు ప్రజలు చరమగీతం పాడాలని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు లక్కర్సు శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం మండలంలోని రాజ్‌పేటలో గడపగడపకు కాంగ్రెస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి మెదక్ పార్లమెంటరీ ఇన్‌చార్జ్ రెజినా హాజరై ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. జిల్లా మహిళా కాంగ్రెస్ ఉపాధ్యక్షురాలు మంజుల, నాయకులు సిద్దగిరిగౌడ్, సిద్దిరాములు, బాలమ్మ, స్వరూప తదితరులు ఉన్నారు.

◆ **నియామకం**

**రామాయంపేట(మెదక్):** కాంగ్రెస్ పార్టీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడిగా లక్ష్మాపూర్ ఎంపీటీసీ నాగులును నియమిస్తూ ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శ్రీకాంత్‌గౌడ్ ఉత్తర్వులు జారీచేశారు. ఈ సందర్భంగా నాగులు మాట్లాడుతూ.. పార్టీ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని తెలిపారు.

◆ **అప్రమత్తంగా ఉండాలి**

**రేగోడ్(మెదక్):** సైబర్ నేరాలపట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్‌ఐ రాజయ్య అన్నారు. మండలంలోని ప్యారారం గ్రామంలో శుక్రవారం ప్రజలకు అవగాహన కల్పించారు. అపరిచిత వ్యక్తుల ఫోన్‌కు స్పందించొద్దని, ఓటీపీ, పాస్‌వర్డ్‌లను చెప్పొద్దని అన్నారు. ఆర్థిక మోసాలకు గురైతే పోలీసులను సంప్రదించాలన్నారు.

◆ **డిమాండ్లు పరిష్కరించాలి**

**మెదక్ కలెక్టరేట్:** అంగన్‌వాడీల డిమాండ్లను పరిష్కరించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా మహిళా కన్వీనర్ నాగమణి డిమాండ్ చేశారు. సమ్మెకు శుక్రవారం వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి మల్లేశం, జిల్లా మహిళా కన్వీనర్ నాగమణి సంఘీభావం తెలిపారు.

◆ **ఈకేవైసీ ప్రారంభం**

**చిన్నశంకరంపేట(మెదక్):** రేషన్ వినియోగదారులు ఈకేవైసీ చేసుకోవాలని తహసీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డి కోరారు. శుక్రవారం మండల కేంద్రంలోని రేషన్ దుకాణాల్లో వినియోగదారుల ఈకేవైసీ ప్రారంభించారు. కుటుంబ సభ్యులు ప్రతి ఒక్కరు ఈకేవైసీ చేసుకోవాలని, వేర్వేరు చోట్ల ఉండే వారు సమీపంలో రేషన్ తీసుకోవచ్చని సూచించారు. రేషన్ డీలర్ల సంఘం అధ్యక్షుడు శంకర్ పాల్గొన్నారు.

◆ **చర్యలు తీసుకోవాలి**

**నర్సాపూర్:** కనీస వసతులు లేని ప్రైవేటు కాలేజీలపై చర్యలు తీసుకోవాలని ఏబీవీపీ పట్టణ కార్యదర్శి అక్షయ్‌గౌడ్ డిమాండ్ చేశారు. శుక్రవారం పట్టణంలోని పలు ప్రైవేటు కాలేజీలను పరిశీలించారు. ఆయనతో రవి, చింటూ, కన్ని, ఆవాజ్, నాగసాయి, అజయ్ తదితరులు ఉన్నారు.

◆ **పీహెచ్‌సీకి బెడ్స్ అందజేత**

**పెద్దశంకరంపేట(మెదక్):** పేట ప్రభుత్వాసుపత్రికి పెద్దశంకరంపేటకు చెందిన చార్టెడ్ అకౌంటెంట్ నీలకంటి దుర్గాప్రసాద్, స్నేహితులు జయకుమార్, సత్యవతి, నూర్ అన్సాన్ బెడ్స్‌ను అందించారు. శుక్రవారం ఎంపీపీ జంగం శ్రీనివాస్ చేతుల మీదుగా వాటిని వైద్యులు వేదశ్రీకు అందజేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ లక్ష్మీ, ఎంపీటీసీ వీణ, నాయకులు పున్నయ్య, హెల్త్‌అసిస్టెంట్ సాయిలు తదితరులున్నారు.

◆ **దొంగిలించిన హుండీ గుర్తింపు**

**చిన్నశంకరంపేట(మెదక్):** మండలంలోని సూరారం గ్రామంలోని శ్రీరేణుకమాత ఆలయంలో దొంగలించిన హుండీ శుక్రవారం చిన్నశంకరంపేటలో ప్రత్యక్షమైంది. బుధవారం రాత్రి సూరారంలోని రేణుకమాత ఆలయం ప్రధాన ద్వారం తాళం పగులకొట్టిన గుర్తుతెలియని దుండగులు హుండీలో నగదును తీసుకొని సూరారం రోడ్డు పక్కన పడేశారు. గమనించిన గ్రామస్తులు గౌడ సంఘం సభ్యులకు సమాచారం అందించారు.